సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 1 । మార్చి । 2024



నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది.

8లో▸



విద్యుత్ దీప కాంతుల్లో అమ్మవారి ఆలయం

పేదల ఇలవేల్పు.. పోలెపల్లి ఎల్లమ్మ

అంగరంగ వైభవంగా జాతర ప్రారంభం

- నాలుగు రోజులపాటు బ్రహ్మోత్సవాలు
- నేడు సిడె వేడుక

కొడంగల్: లక్షలాది మంది భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పోలెపల్లి ఎల్లమ్మ జాతర గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మార్చి 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జాతర సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. రెండు లక్షల మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇందు కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు శుక్రవారం (నేటి సాయంత్రం) సిడె ఘట్టం నిర్వహించనున్నారు. ఈ వేడుకే మావురాల తల్లికి మకుటంగా నిలుస్తుంది. లక్షలాది భక్తులు సిడే వేడుకను తిలకించేందుకు తరలివస్తారు. శనివారం ఉదయం రథోత్సవం, ఆదివారం భక్తుల ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



ప్రత్యేక అలంకరణలో పోలెపల్లి ఎల్లమ్మ

న్యూస్‌రీల్

ఇంటింటికి 'అయోధ్య' ప్రసాదాలు



అయోధ్య ప్రసాదంతో శివస్వాములు

దోమ: మండలంలోని పాలేపల్లికి చెందిన శివ స్వాములు గురువారం అయోధ్య శ్రీరాముడి ప్రసాదాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఇటీవల వారు శ్రీరాముడిని దర్శించుకొని స్వగ్రామానికి చేరుకున్నారు. స్వామి వారి ప్రసాదాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివస్వాములు దస్తయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి నిజం లేదు: ఎస్పీ

అనంతగిరి: జిల్లాలో పిల్లలను ఎత్తుకెళ్లే గ్యాంగ్‌లు సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే పోస్టులను షేర్ చేయరాదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూం సెల్ నంబర్ 8712670056కు సమాచారం ఇవ్వాలన్నారు. అన్ని వేళలా పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కందుకూరు: ఉపాధి కూలీలకు వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత అధికారులకు ఆదేశించారు. మండల పరిధి లోని రాచులూరు, బేగంపేట గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆమె తనిఖీ చేశారు. వన నర్సరీని పరిశీలించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు చేసే ప్రదేశంలో తాగునీరు, నీడ కోసం షేడ్ నెట్ల ఏర్పాటు, వడదెబ్బ తగలకుండా అవసరమైతే ఉపయోగించేలా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీల్లో ఉన్న ఖాళీ బెడ్స్‌లో నీడనిచ్చే మొక్కలు, అవెన్యూ ప్లాంట్లు పెంచాలని, నిత్యం మొక్కలకు నీరు అందించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీడీ సక్రియనాయక్, ఎంపీడీఓ సరిత, పంచాయతీ కార్యదర్శి సెల్వమణి, ఈసీ, టీఏలు తదితరులున్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ కోరారు. గురువారం పట్టణంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం ద్వారా 2.8లక్షల మంది రైతులకు సుమారు రూ.11.8 కోట్ల పెట్టుబడి సాయం చేసినట్లు వివరించారు. గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, 10 కోట్ల మందికి పైగా ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, 12 కోట్ల మందికి ఉచిత మరుగుదొడ్లు నిర్మించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి కాపాడుకునేందుకు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ దిశగా నాయకులు సైనికుల్లా కృషి చేయాలన్నారు.

'రేషన్' ఆపరు



ముగిసిన ఈకేవైసీ గడువు

- జిల్లాలో 75 శాతమే పూర్తి
- ముందుకు రాని 25శాతం మంది
- గడువు పొడిగింపుపై కొరవడిన స్పష్టత
- నరుకుల నరఫరా ఆపరంటున్న అధికారులు

జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు	2,41, 350
రేషన్ దుకాణాలు	588
ఇప్పటి వరకు పూర్తయిన ఈకేవైసీ	1,81,012

వికారాబాద్ అర్బన్: బోగస్ రేషన్ కార్డులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ గురువారంతో ముగిసింది. జిల్లాలో ఇప్పటి వరకు 75శాతం ఈకేవైసీ పూర్తయ్యింది. చౌకధర దుకాణాల ద్వారా రేషన్ సరుకులను మరింత వేగంగా అందించడం తోపాటు బోగస్ కార్డులకు చెక్ పెట్టేందుకు ఈకేవైసీ తప్పనిసరి అని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక సార్లు గడువు ఇచ్చింది. అయినా ఆశించిన స్థాయిలో లబ్ధిదారులు నమోదు చేసుకోలేదు. ఆహార భద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రక్రియ ప్రారంభంలో మీ–సేవ కేంద్రాల్లో కొనసాగించారు. అక్కడ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుర్తించిన ప్రభుత్వం రేషన్ దుకాణాల్లోనే ఈకేవైసీ చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో డీలర్లు ఆరు నెలలుగా లబ్ధిదారుల వేలిముద్రలు సేకరిస్తున్నారు. కానీ 75శాతమే పూర్తయ్యింది.

కొత్త యంత్రాలు వచ్చినా..

రేషన్ సరుకుల పంపిణీ, ఈకేవైసీ నమోదులో తరచూ ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు సివిల్ సప్లై అధికారులు పలు రకాల చర్యలు తీసుకున్నారు. 4జీ నెట్‌వర్క్ సదుపాయంతో కొత్త ఈ–పాస్ యంత్రాలను డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. జిల్లాలోని 588 మంది డీలర్లకు కొత్త యంత్రాలను పంపిణీ చేశారు. గతంలో ఉన్న పాత యంత్రాల్లో థంబ్, ఐరీస్ సరిగ్గా రికార్డు కాకపోవడంతో లబ్ధిదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఫలితంగా రేషన్ తీసుకునేందుకు రోజుల తరబడి దుకాణాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితిని మెరుగు పరిచేందుకు వైఫై, బ్లూటూత్ అందుబాటులో ఉండే కొత్త యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యంత్రాల్లో ఐరీస్, థంబ్ క్షణాల్లో క్యాప్చర్ అవుతోంది. లబ్ధిదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా రేషన్ సరుకులు అందుతున్నాయి. నూతన సాంకేతిక యంత్రాలు అందుబాటులో ఉన్నా ఈకేవైసీ పూర్తి కాకపోవడం వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉందనే దానిపై విమర్శలు వస్తున్నాయి.

నేటికి రేషన్ కార్డుల్లో మృతుల పేర్లు

జిల్లాలో చాలా చోట్ల మృతి చెందిన వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించకుండానే సరుకులు పొందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు నెలల తరబడి అవకాశం ఇచ్చినా కొందరు ముందుకు రాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,41,350 రేషన్ కార్డులు ఉన్నాయి. కొన్ని చోట్ల మృతి చెందిన వారి పేరిట ప్రతినెలా బియ్యం, ఇతర సరుకులు పొందుతున్నారు. మృతి చెందిన సమాచారం ఇస్తే తక్కువ సరుకులు వస్తాయేమోననే ఉద్దేశంతో కొందరు ఈ కేవైసీ చేసేందుకు వెనుకాడుతున్నట్లు సమాచారం. వివరాలు బయట పెట్టకుండా ఆ కుటుంబంలో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేసి సరుకులు పొందవచ్చు. అయితే మృతుల పేర్లను రికార్డులోంచి తొలగించి, అర్హుల పేర్లను చేర్చాలని మరి కొంత మంది ప్రజలు కోరుతున్నారు. లబ్ధిదారులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని అంటున్నారు. అయితే ఇప్పటికిప్పుడు ఈకేవైసీ లేదనే కారణంతో బియ్యం పంపిణీని తిరస్కరించడం జరగదని అధికారులు పేర్కొంటున్నారు. లబ్ధిదారుల ఆధార్‌ను పది సంవత్సరాలకు ఒకసారి అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకున్న వారు రేషన్ దుకాణానికి వెళ్లి ఈ -పాస్ యంత్రంపై వేలి ముద్ర వేయాల్సిన పనిలేదని అంటున్నారు. అయితే రేషన్ బియ్యానికి వెళ్లినప్పుడు మాత్రం తమ ఈకేవైసీ అప్‌డేట్ చేసి ఉందో లేదో తెలుసుకోవాలని, ఆధార్ అప్‌డేట్ చేయించుకోని వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి



రేషన్‌కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తయితే రేషన్ సరుకులు పొందడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఈకేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ అందకపోవడం అంటూ ఏమీ లేదు. అందరికి రేషన్ సరుకులు అందుతాయి. కానీ ఈకేవైసీ చేసుకోవడం తప్పనిసరి. గడువు పొడిగిస్తారా లేదా అనే విషయం ఇంకా తెలియదు.

– రాజేశ్వర్, జిల్లా సివిల్ సప్లైఅధికారి



నాలుగేళ్లు..రూ.45 లక్షలు..!

ప్రారంభానికి నోచుకోని సబ్‌జైలు

కొడంగల్: కొడంగల్ మున్సిఫ్ కోర్టు ఆవరణలోని సబ్‌జైలుకు నాలుగేళ్ల క్రితం రూ. 45 లక్షలతో మరమ్మతులు చేశారు. పనులు పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. గతంలో ఇక్కడ ఉన్న సబ్‌జైల్‌ను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి తరలించారు. నాటి నుంచి ఈ జైలు నిరుపయోగంగా ఉంది. పెరిగిన కేసుల నేపథ్యంలో ఇక్కడి జైలును తిరిగి ప్రారంభించాలని న్యాయవాదులు కోరుతున్నారు.

రూ.9.97 కోట్లతో బడ్జెట్



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

- ఆమోదించిన పరిగి మున్సిపల్ పాలకవర్గం
- పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్

పరిగి: పరిగి మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను గురువారం చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. 2024 - 25 సంవత్సరానికి సాధారణ అంచనా వ్యయం రూ. 5.13 కోట్లు, నిల్వ రూ. 49.68 లక్షలు కాగా మొత్తం రూ.5.63 కోట్లు ఉండగా పూర్తి వ్యయం రూ. 9.97 కోట్లు ఉండనుంది. అనంతరం మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ మాట్లాడారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, అధికారులు కష్టపడి పని చేయాలన్నారు. నిత్యం వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెచ్చి పట్టణ సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొడితే.. తీన్‌మార్

చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేదు.. తల్లిదండ్రులు కాయాకష్టం చేస్తే తప్ప పూట గడవని పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదివారు.. వేదిక ఏదైనా లక్ష్యం ఒక్కటే.. సర్కారు కొలువు సాధించడం.. అమ్మానాన్నల ఆశయాల్ని నెరవేర్చడం.. వారి శ్రమకు ఫలితం దక్కింది.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.. వారే కేకిలమ్మ తండాకు చెందిన ముదావత్ కిషన్, పోల్కంపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్.

- వరుసగా మూడు ఉద్యోగాలకు అర్హత సాధించిన ఇద్దరు యువకులు
- తల్లిదండ్రులకు అండగా నిలవాలని..

వికారాబాద్ అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎంతో కష్టంతో కూడుకున్న పని. అనేక మంది నిరుద్యోగులు ఏళ్ల తరబడి యూనివర్సిటీల్లో ఉంటూ, కోచింగ్‌లు తీసుకుంటూ ఉద్యోగ సాధనే లక్ష్యంగా సాగుతున్నారు. ఇంత కష్టపడ్డా ప్రభుత్వ కొలువు వస్తుందన్న నమ్మకం లేదు. అలాంటిది ఒక వ్యక్తి మూడు ఉద్యోగాలు సాధిస్తే దాని వెనుక ఎంత శ్రమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వరుసగా విడుదల చేసిన టీజీటీ, పీజీటీ, ఏఎల్ గురుకుల ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు యువకులు వరుసగా మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకుంటున్నారు.

ప్రైవేటు టీచర్‌గా..

దోమ మండలం మోత్కూర్ గ్రామ పరిధిలోని కేకిలమ్మ తండాకు చెందిన ముదావత్ కిషన్ వరుసగా మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కిషన్‌ను 'సాక్షి' పలకరించింది. ఆయన మాటల్లోనే.. నేను ఎంతో పేద కుటుంబానికి చెందిన వాడిని.. తండ్రి లచ్చానాయక్, తల్లి బిక్యం. వ్యవసాయ కూలీలు. వారి కష్టంతో చదివించారు. ఒకటి నుంచి 5వ తర గతి వరకు సొంత తండాలోని ప్రభుత్వ పాఠశాల లో చదివా. 6 నుంచి 10వ తరగతి వరకు బండివెర్కచర్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించా. చదువుకుంటూనే అమ్మానాన్నల కూలి పనుల్లో తోడుగా ఉన్నా.. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఏదో ఒక మంచి ఉద్యోగం సా ధించాలనే పట్టుదలతో చదివి విజయం సాధించా.



ముదావత్ కిషన్



విజయ్ కుమార్

చదువే కాదు.. వివేకం కూడా..

టీజీటీ ఉద్యోగానికి మెరిట్ జాబితాలో ఎంపియ్యా. కావాలనే ఉద్యోగానికి వెళ్లలేదు. అలా చేయడానికి కారణం ఉంది.. తాను వెళ్లక పోతే తన వెనుక ర్యాంక్ వాళ్లకు ఆ ఉద్యోగం వస్తుందని భావించా. ఇలా చేయడం ద్వారా మరొక్కరికి అవకాశం కల్పించినట్లు అవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నా. జూనియర్ లెక్చరర్‌గా చేరేందుకు ఆసక్తి చూపుతున్నా.. ప్రస్తుతం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా.. కిషన్ వరుసగా మూడు ఉద్యోగాలు సాధించడంపై నిరుద్యోగులు,తోటి మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మ నాన్నల కష్టాలు తీర్చాలనే..

వరుసగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మరో గిరి పుత్రుడు విజయ్‌కుమార్. ఇతనిది దౌల్తాబాద్ మండలం వాల్కితండా పోల్కంపల్లి గ్రామం. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నాడు. తల్లిదండ్రులు గోవింద్ నాయక్, కలమాబాయి.. విజయ్‌ను ప్రభుత్వ హాస్టల్‌లో ఉంచి ముంబై వెళ్లి కూలీ పనులు చేసి బాబును చదివించారు. అమ్మ నాన్నల కష్టాలు చూడలేక తాను వాళ్లతో పాటు కూలీ పనికి వెళ్లేవాడినని అప్పటి కష్టాలను గుర్తు చేసుకున్నాడు. ప్రస్తుతం పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఎప్పుడు ఇంటికి వెళ్లినా వ్యవసాయ పనులు చేయాల్సిందేనని తెలిపాడు. ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదివినట్లు తెలిపాడు. హాస్టల్ జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వివరించాడు. మంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించి అమ్మనాన్నల కష్టాలు తీర్చాలనే ఆశ చిన్నప్పటి నుంచే ఉంది. ఆ లక్ష్యంతో ముందుకు సాగా.. టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చదువుతున్న సమయంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయరాదనే విషయాన్ని ప్రతి నిరుద్యోగి గుర్తుంచుకోవాలని విజయ్‌కుమార్ తన అనుభవాన్ని వివరించాడు.

జేఎల్‌కు ఎంపికైన నర్సింహారావు



నర్సింహారావు

నవాబుపేట్ మండలం గేటువనంపల్లికి చెందిన ఆలూరి నర్సింహారావు గురుకుల ఫలితాల్లో జేఎల్‌కు ఎంపికయ్యారు. తన చిన్నతనంలోనే తండ్రి వెంకటయ్య మృతి చెందడంతో తల్లి కిష్టమ్మ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించినట్లు తెలిపాడు. తల్లి కష్టాలు చూసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివినట్లు తెలిపాడు. చాలుకూరు గురుకుల పాఠశాలలో చదవడంతోనే మంచి పునాది ఏర్పడినట్లు తెలిపాడు. మొదటి ప్రయత్నంలోనే జేఎల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించిన స్వప్న



స్వప్న

దోమ: నిరుపేద కుటుంబంలో పుట్టిన ఓ యువ తి గురుకుల డిగ్రీ లెక్చరర్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటింది.కిష్టాపూర్ గ్రామానికి చెందిన సత్యమ్మ, వెంకటయ్య కుమార్తె స్వప్న పొలిటికల్ సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్ సాధించింది.దీంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు ఉద్యోగాలకు..



అన్నపూర్ణ

దుద్యాల మండలం లగచెర్ల గ్రామానికి చెందిన సంగు అన్నపూర్ణ నాలుగు ఉద్యోగాలకు ఎంపికై ంది. గురుకుల ఫలితాల్లో మల్టీ జోన్ - 2లో డిగ్రీ లెక్చరర్‌కు అర్హత సాధించారు. స్వగ్రామం దోమ మండలం గుండాల్. 2020లో లగచెర్లకు చెందిన సంగు నరేష్‌తో వివాహం జరిగింది. నరేష్ గ్రూప్స్‌నకు సిద్ధమవుతున్నారు. భర్త ప్రోత్సాహంతో నెట్, జేఆర్‌ఎఫ్, సెట్ అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం వికారాబాద్‌లోని కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టీజీటీ, పీజీటీ, జేఎల్‌తో పాటు డిగ్రీ లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించారు. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించినట్లు ఆమె తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా పార్వతీపరమేశ్వర కల్యాణం



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి, భీంభరత్

నవాబుపేట: మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాల్లో భాగంగా గురువారం పార్వతీపరమేశ్వర కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఎక్బాల్, నాయకులు సామ వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్, అనంత్‌రెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాండూరు టౌన్: తాండూరు బస్టాండ్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని సీఐ సంతోష్‌కుమార్ గురువారం తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సున్న ఇతను నాగర్‌కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్‌కు, మహబూబ్‌నగర్ నుంచి తాండూరుకు వచ్చినట్లు బస్సు టికెట్ల ఆధారంగా చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరి సెల్‌ఫోన్స్ రికవరీ



సెల్‌ఫోన్ రికవరీ చేసి బాధితుడు బిచ్చయ్యకు అందజేస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్

ధారూరు: కూరగాయల సంతలో పోగొట్టుకున్న సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు ధారూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చాకలి నర్సింహులు ఆరు నెలల క్రితం, ఫిబ్రవరి 12న కూరగాయల సంతలో కుమ్మరి బిచ్చయ్య సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సెల్‌ఫోన్‌ను గుర్తించి గురువారం బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బంధువునన్నాడు.. లక్ష కాజేశాడు

రైతుకు కుచ్చుటోపీ పెట్టిన కేటుగాడు

తాండూరు రూరల్: సైబర్ నేరస్తుల మాయ మాటలకు అమాయకులు బలి అవుతున్నారు. బంధువుని చెప్పి.. ఆపదలో ఉన్నానని నమ్మించి.. ఓ వ్యక్తికి కుచ్చు టోపీ పెట్టాడో కేటుగాడు. ఈ సంఘటన కరన్‌కోటపోలీస్‌స్టేషన్ పరధిలోని ఐనెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి ఉల్లిపంట విక్రయించడంతో డబ్బులు వచ్చాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి మీ బంధువు నర్సిరెడ్డినని నమ్మించాడు. గుండె సమస్యతో ఆస్పత్రిలో ఉన్నానని వెంటనే రూ.లక్ష ఫోన్ పే చేయాలని గోపాల్‌రెడ్డిని కోరాడు. దీనికి స్పందించి ఆయన తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ పే ద్వారా రూ.లక్ష పంపించారు. సమీప బంధువుల ద్వారా అసలు విషయం తెలుసుకున్న గోపాల్‌రెడ్డి ఓ అపరిచితుడికి డబ్బులు పంపినట్లు గుర్తించారు. వెంటనే కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తి ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సైబర్‌క్రైమ్ ద్వారా మోసం జరిగిందా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

పోలియో చుక్కలు తప్పక వేయించాలి

రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారి అజార్

షాద్‌నగర్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అజార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎం, ఆశవర్కర్లకు గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అజార్ మాట్లాడుతూ... మార్చి 3న ప్రభుత్వం నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

- మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్
- జిల్లాలో 386 ఖాళీలు
- 4నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తొలిసారి సీబీటీ పద్ధతిలో పరీక్ష



తాండూరు టౌన్: ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గురువారం నోటిఫికేషన్‌ను జారీ చేసిన నోటిఫికేషన్‌లో 386 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 102, లాంగ్వేజ్ పండి ట్ 23 పోస్టులు, పీఈటీ ఐదు, ఎస్జీటీ 195, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ టీచర్స్ 11 , ఎస్జీటీ 37 ఖాళీలు ప్రకటించారు. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులకు గడువు నిర్ణయించింది. తొలిసారిగా సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో డీఎస్సీ పరీక్షను మే మాసంలో పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. తాండూరు పట్టణంలో ఇప్పటికే పలు కోచింగ్ సెంటర్లు ఉద్యోగార్థులకు శిక్షణ ఇస్తున్నాయి. గతంలోనూ కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ కోచింగ్ ఇచ్చిన అనుభవాలున్నాయి. మరికొన్ని కోచింగ్ సెంటర్లు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో అభ్యర్థుల మనోగతం వారి మాటల్లోనే..

అక్రమాలకు తావివ్వద్దు



2019లో డీఈడీ పూర్తి చేసుకుని టెట్‌లో అర్హత సాధించాను. ఐదేళ్లుగా నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నా. టెట్‌కు ప్రగతి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని 120 మార్కులు సాధించాను. మరోసారి డీఎస్సీ కోచింగ్ తీసుకుంటాను. గత ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపింది. నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– డి.నగేశ్, డీఎస్సీ అభ్యర్థి, తాండూరు

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మెగా డీఎస్సీ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. నాలుగేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రిపేర్ అవుతున్నా. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగం సాధించాలనే తపనతో చదువుతున్నా. డీఎస్సీ నోటిఫికేషన్ వేయడం.. మేలో పరీక్ష నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాం.

– కుర్వ విష్ణు, డీఎస్సీ అభ్యర్థి, జనగాం

నిరుద్యోగుల కోసమే కోచింగ్ సెంటర్



గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల కోసమే ప్రగతి కోచింగ్ సెంటర్ పెట్టాను. అవనిగడ్డలో బోధించే అధ్యాపకులచే ఇక్కడ బోధన నిర్వహిస్తున్నాం. టెట్, డీఎస్సీ, కానిస్టేబుల్ జాబ్‌లకు కోచింగ్ ఇచ్చాం. గతంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగం సాధించారు. తాజాగా మెగా డీఎస్సీ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. డీఎస్సీ అభ్యర్థులకు ఉత్తమ కోచింగ్ ఇచ్చి వారి లక్ష్య సాధనలో తోడ్పాటునందిస్తాం.

– డి.శ్రీశైలం, ప్రగతి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

సులభంగా డబ్బు సంపాదించేందుకు..

ద్విచక్రవాహనాల చోరీ

- బైక్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడికి రిమాండ్

తాండూరు రూరల్: సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో ఓ బైక్ మెకానిక్ ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా సేడం తాలూక కురుగుంట గ్రామానికి చెందిన 21 ఏళ్ల బోస్లే నిఖిల్ బైక్ మెకానిక్. ఈజీగా డబ్బు సంపాదించాలని బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. కొన్ని నెలలుగా వికారాబాద్ రైల్వే స్టేషన్, తాండూరు ఆస్పత్రి, మోమిన్‌పేట్, మన్నెగూడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగతనం చేశాడు. ఫిబ్రవరి 24న గౌతాపూర్ చౌరస్తా వద్ద ఓ బైక్‌ను దొంగతనం చేశాడు. అదే రోజు గౌతాపూర్ చెక్‌పోస్ట్ వద్ద కరన్‌కోట్ పోలీసేఉలు తనిఖీలు చేపట్టారు. వీరిని గమనించిన నిఖిల్ తప్పించుకునేందుకు యత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. బైక్ పేపర్స్ చూపమని కోరడంతో లేవన్నాడు. దీంతో మెకానిక్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా 12 బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నాడు. వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

అనుమతి పేరిట అక్రమ దందా

అనుమతుల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా దందా మాత్రం కొనసాగుతూనే ఉంది. దీంతో స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పర్మిషన్ ఓ చోట.. డంపింగ్ మరో చోట
- ప్రభుత్వం మారినా ఆగని ఇసుక రవాణా
- రెవెన్యూ అధికారులపై ఆరోపణలు



తాండూరు పట్టణంలోని గాంధీన గర్‌కు ఇసుక పర్మిషన్ ఇచ్చిన పర్మిట్



తాండూరులో డంప్ చేయాల్సిన ఇసుకను గౌతపూర్‌లో ఖాళీ చేస్తున్న ట్రాక్టర్ యజమాని

తాండూరు రూరల్: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సైతం విఫలమవుతోంది. అనుమతుల పేరిట అడ్డదారిలో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం సిబ్బంది కొరత అంటూ తప్పించుకుంటున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను సైతం విడిపించేందుకు రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని ఖాంజాపూర్, పాత తాండూరులోని కాగ్నా వాగులో రీచ్‌లను గుర్తించారు. ఒక్కో ట్రాక్టర్ తరలించేందుకు కలెక్టర్ పేరిట రూ.600 డీడీ చెల్లించి ఇసుక తరలించాలి. కాగా ట్రాక్టర్ యజమానులంతా సిండికేట్‌గా మారి నాలుగు ట్రిప్పులకు పర్మిషన్ తీసుకుని పది ట్రిప్పుల వరకు ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. భవన నిర్మాణ దారులకు రూ.3,500 నుంచి రూ.4వేల వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటారని పలువురు వాపోతున్నారు. కొన్నిసార్లు రీచ్‌ల నుంచి తీసుకెళ్లినంతా ఓ చోట డంప్ రాత్రిళ్లు అవసరమైన వారికి తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు ఇచ్చి పర్మిట్లు..?

ఇసుక పర్మిషన్లు ఇస్తున్న తాండూరు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు తీసుకుని పర్మిట్లు ఇస్తున్నారంటూ అపవాదు మూటకట్టుకుంటున్నారు. బయట వ్యక్తులను తీసుకువచ్చి ఇంటి యజమానిగా చూపుతూ పర్మిట్లు రాయించుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సిబ్బంది కొరత ఉందటూ దాటవేస్తున్నారు. ప్రతీ రోజు సాయంత్రం అక్రమార్కులు తహసీల్దార్ కార్యాలయం వద్ద వాలిపోయి అధికారులకు డబ్బు ఆశ చూపి పర్మిట్లు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జరిమానా వేశాం



సాయిపూర్‌కు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని ఖాంజాపూర్ కాగ్నా నది నుంచి ఇసుక తరలించేందుకు పరిమ్షన్ తీసుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో డంప్ చేయాల్సిన ఇసుకను రూ.3,500 తీసుకుని గౌతాపూర్‌లో డంప్ చేశాడు. ఆ యజమానికి రూ.5వేల జరిమానా వేశాం. మరోసారి పట్టుపడితే ట్రాక్టర్ సీజ్ చేస్తాం.

– జాకబ్, మైన్స్ ఏడీ, తాండూరు డివిజన్

విచారణకు ఆదేశించా



పర్మిషన్ పేరిట ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నాం. గాంధీనగర్‌లో ఘటనపై విచారణకు ఆదేశించాం. డబ్బులు తీసుకుని పర్మిట్లు ఇస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. అసత్య ప్రచారం చేస్తే అన్ని పర్మిషన్లు రద్దు చేస్తాం.

– తారాసింగ్, తహసీల్దార్, తాండూరు డివిజన్

ఈ-కేవైసీతో ప'రేషన్'

బోగస్ రేషన్ కార్డులు తొలగించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ ఐదు నెలలుగా కొనసాగింది. తొలుత డిసెంబర్ 31 వరకు, ఆ తర్వాత జనవరి 31 వరకు గడువు ఇచ్చారు. అయినప్పటికీ పూర్తిగా ఈ-కేవైసీ చేసుకోక పోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 29వరకు మరో అవకాశం ఇచ్చింది.

- గురువారంతో ముగిసిన గడువు
- నేటికీ 90శాతమే పూర్తి
- ఆందోళనలో వేలి ముద్రలు ఇవ్వని లబ్ధిదారులు

వివరాలు

పంచాయతీలు	36
రేషన్ దుకాణాలు	34
రేషన్ కార్డులు	13,112
లబ్ధిదారులు	44,406
అంత్యోదయ కార్డులు	1,909
లబ్ధిదారులు	4,843
ఆహారభద్రత కార్డులు	1,1023
లబ్ధిదారులు	39,563



ఈకేవైసీ చేస్తున్న డీలర్ (ఫైల్)

దోమ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ-కేవైసీ గడువు గురువారంతో ముగిసింది. పేదల ఆకలి తీర్చేందుకు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ దుర్వినియోగం కాకుండా ప్రభుత్వాలు ఈ-కేవైసీ చేయించాలని నిర్ణయించాయి. దీంతో లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి ఈ-కేవైసీతో పునరుద్ధరించాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. అయితే ప్రతి లబ్ధిదారుడు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి డీలర్ వద్ద ఈ-పాస్ యంత్రంలో వేలిముద్రలు ఇచ్చి ఈ-కేవైసీ నమోదు చేసుకున్నారు. పలువురు అవగాహన లేమితో చేసుకోలేకపోయారు. దీంతో వారికి రేషన్ నిలిచిపోతుందనే సంకేతాలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమకు కొంత గడువు పొడగిస్తే పూర్తి చేసుకుంటామని చెబుతున్నారు. ఇప్పటి వరకు కేవలం 90శాతం లబ్ధిదారులే ఈ-కేవైసీ చేసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారు రేషన్ రాదేమోనని ఆందోళనలో ఉన్నారు.

గడువు పెంచాలి



ప్రభుత్వం ఈ-కేవైసీ గడువును పొడిగించాలి. కొంత మంది నిరుపేద కుటుంబాలు నేటికి ఈ-కేవైసీ చేయించుకోలేదు. దీంతో వారికి సరుకులు అందకపోవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి గడువు పొడగిస్తే వారికి న్యాయం జరుగుతుంది.

– రాములు, ఎంపీటీసీ సభ్యుడు, బొంపల్లి

డీలర్లకు సమాచారం ఇస్తాం



రేషన్ ఈ-కేవైసీ గడువు పెంపుపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేవు. గురువారంతో గడువు ముగిసింది. గత కొన్ని రోజులుగా రేషన్ డీలర్లతో ఈ-కేవైసీ చేయించాం. చాలా వరకు మండలంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి గడువు పెంచాలని ఆదేశాలు వస్తే రేషన్ డీలర్లకు సమాచారం అందిస్తాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

పాడిపశువులు చోరీ

యాచారం: గుర్తు తెలియని దుండగులు ఓ రైతు పాడి పశువులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని గున్‌గుల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన యార కిష్టయ్య రోజు మాదిరిగానే బుధవారం రాత్రి తన వ్యవసాయ క్షేత్రం వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా సుమారు రూ.2లక్షలకు పైగా విలువ చేసే రెండు పాడి పశువులు, ఓ దూడ కనిపించలేదు. దీంతో రైతు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్

డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

యాచారం: నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు ఇబ్రహీంపట్నం న్యాయస్థానం గురువారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా, నార్కట్‌పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన బి.గణేశ్ 2019లో సాగర్‌రోడ్డుపై వాహనాన్ని అతివేగంగా నడిపి గున్‌గుల్ గేట్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన యాచారం పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీసులకు పూర్తి ఆధారాలతో వివరాలు సమర్పించారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఎంవీఎస్ఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

బడంగ్‌పేట్: సాంకేతిక రంగాన్ని విస్తృత పరిచేందుకు నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం డ్యాప్కామ్–24 (డేటా అక్విసిషన్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్) అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఎంవీఎస్ఆర్ చైర్మన్ కేవీఆర్ కశ్యప్, పి.లక్ష్మీనారాయణ అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ సదస్సు సాగనుంది. మొదటి రోజు వివిధ యూనివర్సిటీల నుంచి 600 మంది రచయితలు పేపర్లు సమర్పించారు. అందులో 32 పేపర్లు రిజక్ట్ చేశారు. 23 పేపర్లు యూజీసీకి సెలెక్ట్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్లు ఉంటాయని ప్రొఫెసర్ డా.సంధ్య వివరించారు. ప్రొ.మోరారు లుమినిటా(రుమేనియా), హెచ్‌ఓడీ ప్రొ.ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ కనకదుర్గ, సెక్రటరీ శ్రీనివాసరావు, మూర్తి, రాజేశ్ కులకర్ణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ వివాహం

- ఒక్కటైన ఆంధ్రా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన కొత్త జంట



ఏపీ పోలీసులు, బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ, ఎస్‌ఐలు

తాండూరు రూరల్: ఆంధ్ర అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి వివాహంతో ఒక్కటయ్యారు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయం.. ప్రేమగా మారి పెళ్లి పీటలు ఎక్కించింది. ఇద్దరూ మేజర్లే కావడంతో ఖమ్మంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీశైలం హైదరాబాద్‌లోని ఓ జ్యూస్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం ఇతనికి ఇన్‌స్టాగామ్‌లో రాజమండ్రికి చెందిన అనూషతో పరిచయం ఏర్పడింది. ఇలా సాగిన వీరి స్నేహం ప్రేమగా మారింది. దీంతో కలిసి జీవితం పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అనూష నుంచి ఫోన్ రావడంతో రాజమండ్రి వెళ్లిన శ్రీశైలం నాలుగు రోజుల క్రితం ఆమెను తీసుకుని ఖమ్మం చేరుకున్నాడు. ఇక్కడే యువతి మెడలో తాళిబొట్టు కట్టాడు. అనంతరం నేరుగా తాండూరుకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా అనూష కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు రాజమండ్రిలోని రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. యువతి సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శ్రీశైలం అడ్రస్ తెలుసుకుని యువతి తల్లిదండ్రులతో కలిసి కరన్‌కోట్ పీఎస్‌కు వచ్చారు. రూరల్ సీఐ అశోక్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి నూతన దంపతులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. తమతో రావాలని ఎంత బతిమాలినా అనూష వినలేదు. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. అనూష అడ్రస్ లభించడంతో అదృశ్యం కేసును కొట్టేస్తామని ఏపీ పోలీసులు తెలిపారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఇందిర

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా హెచ్చరించారు. మండలంలోని ఉప్పరిగూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం చైల్డ్ చాపర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల పట్ల అసభ్య ప్రవర్తనలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ఇందిరా హాజరై మాట్లాడుతూ.. బాల్యదశ నుంచే విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులను ప్రేమాభిమానంతో చూసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. చిన్నారులు వేధింపులకు గురి కావడం చాలా బాధాకరమన్నారు. వీటిని రూపుమాపడానికి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలను వేధింపులకు గురి చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు షేక్ జాకీర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రిషిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఇందిరా

కేంద్ర పథకాలను వినియోగించుకోండి

బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్ కోరారు. గురువారం పట్టణంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం ద్వారా 2.8లక్షల మంది రైతులకు సుమారు రూ.11.8 కోట్లు పెట్టుబడి సాయం చేసినట్లు వివరించారు. గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, 10 కోట్ల మందికి పైగా ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, 12 కోట్ల మందికి ఉచిత మరుగుదొడ్లు నిర్మించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి కాపాడుకునేందుకు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ దిశగా కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహగౌడ్, రమేశ్, శివలింగం, శేఖర్‌గౌడ్, జగన్, శ్రీను, మల్లేశ్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.